## క్లుప్తంగా

### పంట అవశేషాలు కాల్చొద్దు

నంద్యాల(సెంట్రల్): పంట అవశేషాలను కాల్చరాదని నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ... రైతులు వరి, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలు పూర్తయిన తరువాత వాటి అవశేషాలను కాల్చడం వల్ల భూమి పై పొరల్లో ఉపయోగ పడే సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. దీని వల్ల హానిచేసే సూక్ష్మజీవులు పెరుగుతాయని చెప్పారు. భూమిలో కార్బన్ శాతం తగ్గుతుందని, కాలుష్యం పెరిగి రోగాలు ఊపిరితిత్తుల జబ్బులు, గుండె జబ్బులు వస్తాయన్నారు. ఇది చట్టరీత్యా నేరం అన్నారు. అదే భూమిలో కలియదున్నడం వలన భూమిలో కార్బన్, నత్రజనిశాతం పెరిగి భూమి సారవంతమవడమే కాకుండా రోగనిరోధక శక్తి ఇనుమడిస్తుందని వెల్లడించారు.

### తుది దశకు రోడ్డు పనులు



గోవిందపల్లె- ఇసుకపల్లె రోడ్డు పై కంకర పరిచిన దృశ్యం

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె– ఇసుకపల్లె గ్రామాల లింక్ రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నాయి. గతంలో ఉన్న లింక్ రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో ప్రభుత్వం రోడ్డు పనులకు రూ. 7.32 కోట్లుమంజూరు చేసింది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో పనులకు కాంట్రాక్టర్ శ్రీకారం చుట్టారు. ఎర్తు వర్క్ పూర్తి చేసి, కంకర పరిచారు. త్వరలో తారు వేస్తామని అధికారులు చెప్పారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరమవుతాయి. గోవిందపల్లె నుంచి ఇసుకపల్లె మీదుగా రుద్రవరం మండలంలోని పలు గ్రామాలకు రోడ్డు సమస్య తీరనుంది.

### 50 క్వింటాళ్ల జీలుగలు మంజూరు

ఉయ్యాలవాడ: మండలానికి పచ్చి రొట్టె ఎరువుల్లో భాగంగా జీలుగ విత్తనాలు 50 క్వింటాళ్లు మంజూరయ్యాయని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. మార్కెట్‌లో జీలుగ విత్తనాలు కిలో రూ. 88 కాగా 50 శాతం సబ్సిడీ పోనూ రైతుకు రూ. 44 కిలో ప్రకారం అందిస్తామని చెప్పారు. అవసరమైన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ సూచించారు.

### విధుల్లో అలసత్వం వీడాలి



సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలోని సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వీడి అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక 30వ వార్డు ఎంఎస్ నగర్ సచివాలయాన్ని సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ విధులకు సంబంధించిన ఫొటోలు సంబంధిత వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేయాలని ఆదేశించారు. పట్టణం సుందరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు.

### భక్తి శ్రద్ధలతో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



స్వామి వారికి మహానైవేద్యం నివేదిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని విశ్వనగర్‌లో వెలసిన శ్రీ గాయత్రీ విశ్వకర్మ దేవస్థానంలో శుక్రవారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధనోత్సవాలను దేవస్థానం వ్యవస్థాపకులు డాక్టర్ విశ్వరూపాచారి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు.

### గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

గోస్పాడు: ఉపాధి పనులకు వెళ్లిన ఎద్దుల పెద్దపుల్లయ్య (70) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని ఎస్.కూలూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఉపాధి సిబ్బంది తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పెద్దపుల్లయ్య రోజు మాదిరిగా ఉపాధి హామీ పనికి వెళ్లాడు. కొంత సేపు పని చేసిన అనంతరం గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి కిందపడిపోవడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు. ఎంపీడీఓ నాగఅనసూయ, ఏపీఓ నాగజ్యోతి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

---

అటవీ సంరక్షణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సంబంధిత పనులు చేయించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశిస్తుంది. సాధారణంగా ఎక్కడైనా వెంటనే పనులు చేయించి కూలి చెల్లించడం చూస్తుంటాం. కానీ.. రుద్రవరం రేంజిలో మాత్రం అందుకు విరుద్ధంగా.. ఉచితంగా పనులు చెయ్.. నీకు కావలసింది అడవి నుంచి పట్టుకెళ్లు అని.. కూలీలకు అధికారులు చెబుతూ పనులకు మంజూరైన నిధులను స్వాహా చేస్తున్నారు. అలాగే పశువులు మేపుకునేందుకు కొన్ని ఆశ్రమాలు, పెంపకందారుల నుంచి ప్రతిఫలంగా సొమ్ములు, బియ్యం, సరుకులు వసూలు చేసుకుంటున్నారు. మీకిది కావాలా.. అయితే మాకు ఇది ఇవ్వాలని ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. దీంతో నల్లమల అడవి బయలు ప్రాంతంగా దర్శనమిస్తోంది.



చెట్లు కొట్టేయడంతో అడవిలో మేస్తున్న ఆవులు

# పని చెయ్.. చెట్లు కొట్టుకో!

- పనులు చేయించుకుని కూలి ఇవ్వకుండా చెట్లు కొట్టుకెళ్లమంటున్న అధికారులు
- దొంగలు, అధికారుల మధ్య ఇచ్చి, పుచ్చుకునే ఒప్పందం
- తరలిపోతున్న అటవీ సంపద
- ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు స్వాహా
- టైగర్ జోన్ నిబంధనలు గాలికి
- అడవిలోకి ఆవులు,గొర్రెల మందలు

రుద్రవరం: అటవీ అధికారులు.. అడవిని సంరక్షించడం వారి విధి..కానీ.. రుద్రవరం రేంజిలో మాత్రం అక్రమాలకు అలవాటు పడిని కొందరు అధికారులు.. దొంగలకు అడవిపై పెత్తనం అప్పగించారు. ఇందుకు ప్రతిఫలం కూడా తీసుకుంటున్నారండోయ్. ముందుగా దొంగల నుంచి ఒప్పందాలు సైతం చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటవీ సంరక్షణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏవైనా పనులు చేయాల్సి ఉంటే.. వెంటనే వివిధ గ్రామాల నుంచి కూలీలను పిలిపించి పనులు చేయిస్తారు. ఇందుకు రూపాయి కూడా కూలి ఇవ్వరు. నిజమండీ.. అందుకు ప్రతిఫలంగా అడవి నుంచి ఏ చెట్టునైనా కొట్టుకెళ్లు అంటూ సలహా కూడా ఇస్తున్నారు. అలాగే ఆవులు,గొర్రెల మందలను మేపుకోవచ్చని అందుకు వారికి సొమ్ము, బియ్యం బస్తాలు, అవసరమైనప్పుడు పొట్టేళ్లు ఇవ్వాలని ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ఒప్పందాలు నల్లమల అటవీ సమీప గ్రామాల్లో చర్చనీయాంశంగా మారాయి.

**ఒప్పందాల్లో మచ్చుకు కొన్ని ..**

➡ రుద్రవరం,చెలిమ రేంజిల్లో వేసవి ప్రారంభం కాగానే అటవీ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఫైర్ లైన్లు, యూ లైన్ల పనులు చేయించేందుకు నిధులు మంజూరయ్యాయి. అంటే అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలు పక్కకు వ్యాపించకుండా కారిడార్ మాదిరిగా శుభ్రం చేయడం. ఆ పనులు చేయించే బాధ్యతను సంబంధిత సెక్షన్ అధికారు లు, ఎఫ్‌బీఓలకు అప్పగించారు. వారు వారి పరిధిలో అడవిలో నుంచి వెదుర్లు, టేకు తీసుకెళ్లే వారి తో ఒప్పందాలు కుదుర్చుకొని ఉచితంగా పనులు చేయించుకున్నారు. పనులు చేయించుకొని తమకు కూలి ఇవ్వలేదని రుద్రవరం మండలంలోని హరినగరం, శిరివెళ్ల మండలంలోని మహదేవపురం తదితర గ్రామాలకు చెందిన కూలీలు బహిరంగంగానే చెబుతున్నారు. కాగా చేసిన పనులకు మంజూరైన నిధులను మాత్రం ఆయా అధికారులు మింగేశారు.

➡ ఇటీవల అటవీ సంరక్షణ కోసం ఉన్నతాధికారులు రుద్రవరం రేంజికి రెండు బేస్ క్యాంపులు మంజూరు చేశారు. రుద్రవరం సెక్షన్ చిల్లమాను పెంటలో ఒకటి, నూతల సెక్షన్ గండ్లేరు రిజర్వాయరు వంతెన వద్ద మరొకటి. ఒక్కో బేస్ క్యాంప్‌లో నలుగురు చొప్పున ప్రొటక్షన్ వాచర్లు ఉండేలా ఉత్తర్వులు ఇచ్చారు. ప్రొటక్షన్ వాచర్లు ఉండేందుకు బేస్ క్యాంప్ ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ముందుగా నూతల సెక్షన్ ఉద్యోగులు బేస్ క్యాంప్ పనులు చేపట్టారు. ఇందుకు మండలంలోని నర్సాపురం, హరినగరం, ఆళ్లగడ్డ మండలం అహోబిలం గ్రామాలకు చెందిన కొదరు కూలీలతో క్యాంప్ ఏర్పాటు చేసే స్థలంలో చుట్టూ ఉన్న వృక్ష సంపదను తొలగించారు. వారం రోజుల పాటు గుడిసె సామగ్రి, పాదులు తీయడం,గుడిసెను వేయడం, పై కప్పుగా తడికెలు అల్లించి అమర్చడం వంటి పనులన్నీ చేయించారు. సాయంత్రం అయ్యే సరికి వారికి కాఫీ,కూల్ డ్రింక్స్ తాపించి కూలి సొమ్ముకు ఎగనామం పెట్టారు. కూలి అడిగితే అడవి నుంచి ఏదైనా తెచ్చుకోండి, మేం పట్టించుకోం..అని చెప్పారని పలువురు కూలీలు వాపోతున్నారు.



నూతల సెక్షన్‌లో కూలీలు వేసిన షెడ్డు

➡ కొద్ది నెలల క్రితం రుద్రవరం మండలంలోని హరినగరం గ్రామానికి చెందిన పలువురు గిరిపుత్రులు అడవి నుంచి వెదుర్లు తెచ్చుకుంటుండగా అటవీ అధికారులు వారిపై దాడి చేసి చితకబాదారు. వారిలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. ఆ వ్యక్తి అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సంబంధిత అధికారిపై కేసు నమోదు చేయించాడు. కేసు నమోదైతే తన ఉద్యోగానికి ఇబ్బందులు తలెత్తుతాయని సదరు ఉద్యోగి గిరిపుత్రులతో రాజీ ఒప్పందం కుదుర్చుకున్నాడు. గుట్టుచప్పుడు కాకుండా అడవి నుంచి వెదుర్లు తోలుకోవాలని, అడ్డుపడనని చెప్పి కేసు లేకుండా చేయించుకున్నట్లు తెలిసింది.

➡ అహోబిలం కాశిరెడ్డినాయన ఆశ్రమం, ఇస్కాన్ టెంపుల్ తదితర సంస్థలకు చెందిన గోవులకు అందుబాటులో పశుగ్రాసం లేక పోవడంతో వాటిని అడవిలోకి తీసుకెళ్లి మేపుకునేవారు. అలా అడవిలోకి వెళ్లి మేపుకునేందుకు అటవీ ఉద్యోగుల్లో కొందరికి నగదుతో పాటు ఏడాది పొడవున సరిపడ బియ్యం ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే సాసర్ పిట్‌లలో నీరు కూడ వారే నింపేవారని, అలాగే గొర్రెల కాపర్ల నుంచి పొట్టేళ్లు ఇచ్చేలా ఒప్పందాలు చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇలా పలు రకాల ఒప్పందాలతో అటవీ శాఖ అధికారులు రెండు చేతులా సంపాదిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఉద్యోగులు ఇలా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ కొండను కొల్లగొట్టిస్తుండటంతో అడవి బయలు ప్రదేశంగా మారి పచ్చదనం కనుమరుగవుతోంది. రుద్రవరం రేంజిని టైగర్ జోన్‌గా ప్రకటించినప్పటికీ నిత్యం దొంగల రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయంటే అధికారుల సహకారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

### మా దృష్టికి రాలేదు



అటవీ ప్రాంతంలో సాగుతున్న పలు రకాల ఒప్పందాలు, అక్రమ రవాణా, ప్రధానంగా నూతల సెక్షన్‌లో సాగుతున్న వాటి గురించి నా దృష్టికి రాలేదు. వెంటనే ఆ ఒప్పందాలపై విచారణ జరిపి ప్రమేయం ఉన్నట్లు తేలితే సంబంధిత ఉద్యోగులపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తాం.

– శ్రీపతినాయుడు, రుద్రవరం రేంజి అధికారి,

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నంద్యాల(అర్బన్): ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ స్తంభాల ఆధునీకరణలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పట్టణంలోని డి2, డి3 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈలు రామయ్య, రవికుమార్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మైన బజారులో వెలసిన అమ్మవారి శాలలో శుక్రవారం వాసవీ మాత జయంతిని పురస్కరించుకొని రెండవ రోజు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ పంచామృతాభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి చిలుకముడుపు కార్యక్రమం నిర్వహించి, మహామంగళ హరతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు భవనాశి వాసు మాట్లాడుతూ వాసవీమాతకు జాలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం జరిపించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ సీనియర్ నాయకుడు నెరవాటి సత్యనారాయణ, వినోద్, రవి కుటుంబ సభ్యులు అమ్మవారికి బంగారు హారాన్ని అందజేశారు.




అమ్మవారికి బంగారు హారం అందజేస్తున్న నెరవాటి సత్యనారాయణ కుటుంబ సభ్యులు

### వర్షం..హర్షం



క్రిష్టిపాడులో వర్షం కురుస్తున్న దృశ్యం

దొర్నిపాడు: వాతావరణం మార్పుతో మండలం ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. రెండు నెలలుగా భానుడు ప్రతాపం చూపించడంతో తీవ్ర వడగాల్పుతో ఉక్కిరిబిక్కిరయ్యారు. రెండు రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. శుక్రవారం సాయంత్రం భారీ ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. ముందస్తు ఖరీఫ్‌నకు ఈ వర్షం ఉపయోగ పడుతుందని రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కనువిందు చేసిన ఇంద్రధనుస్సు

### చాగలమర్రి మండలంలో 83 శాతం పోలింగ్ నమోదు



చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం ఆరున్నర గంటలకే బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

చాగలమర్రి: ఈ నెల 13వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మండలంలోని వివిధ గ్రామాల్లోని 52 పోలింగ్ కేంద్రాల్లో 83.09334 శాతం పోలింగ్ నమోదైనట్లు ఏఈఆర్‌ఓ రమణమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని మొత్తం ఓటర్లు 40,765 ఉండగా.. ఇందులో 20,180 మంది పురుషులు, 20,584 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 33,873 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 16,881 మంది పురుషులు, 16,991 మంది మహిళలున్నారు. అందులో చాగలమర్రిలో 20 వార్డులకు 19 పోలింగ్ కేంద్రాల పరిధిలో 17,209 ఓట్లు నమోదు కాగా వాటిలో 13,206 ఓట్లు పోలై, 76.74 పోలింగ్ శాతం నమోదైంది. 2019 ఎన్నికల కంటే ఎక్కువ శాతం నమోదైందని ఆమె చెప్పారు.

**గ్రామాల వారీగా పోలింగ్ శాతం..**

| పోలింగ్ కేంద్రం నెం: | గ్రామం పేరు | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | పోలింగ్ శాతం |
|---|---|---|---|---|
| 185 | పెద్ద బోధనం | 1121 | 970 | 86.52988 |
| 186 | నేలంపాడు | 692 | 289 | 85.98266 |
| 187 | నేలంపాడు | 516 | 449 | 87.0155 |
| 188 | కలుగొట్లపల్లె | 326 | 264 | 60.9816 |
| 189 | నగళ్లపాడు | 334 | 312 | 93.41317 |
| 190 | గొట్లూరు | 673 | 589 | 87.38872 |
| 191 | మల్లెవేముల | 894 | 801 | 89.59732 |
| 192 | బ్రాహ్మణపల్లె | 614 | 518 | 84.36.482 |
| 193 | చిన్న బోధనం | 803 | 729 | 90.78456 |
| 194 | తిప్పనపల్లె | 247 | 232 | 93.92713 |
| 203 | తోడేండ్లపల్లె | 1067 | 985 | 92.3149 |
| 204 | శెట్టివీడు | 759 | 695 | 91.56785 |
| 205 | శెట్టివీడు | 261 | 228 | 87.35632 |
| 206 | జ్ఞానాపురం | 168 | 150 | 89.28571 |
| 207 | కదిరిపురం తండా | 528 | 503 | 95.26515 |
| 208 | మద్దూరు | 766 | 671 | 87.59791 |
| 209 | మద్దూరు | 783 | 639 | 81.6092 |
| 210 | చాగలమర్రి | 819 | 722 | 88.15629 |
| 211 | చాగలమర్రి | 862 | 691 | 80.16241 |
| 212 | చాగలమర్రి | 1067 | 808 | 75.72634 |
| 213 | చాగలమర్రి | 679 | 467 | 68.77761 |
| 214 | చాగలమర్రి | 759 | 575 | 75.75758 |
| 215 | చాగలమర్రి | 732 | 573 | 78.27869 |
| 216 | చాగలమర్రి | 678 | 487 | 71.82891 |
| 217 | చాగలమర్రి | 1021 | 826 | 80.90108 |
| 218 | రావంల్లె | 428 | 393 | 91.82243 |

| పోలింగ్ కేంద్రం నెం: | గ్రామం పేరు | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | పోలింగ్ శాతం |
|---|---|---|---|---|
| 219 | చాగలమర్రి | 886 | 657 | 74.1535 |
| 220 | చాగలమర్రి | 779 | 585 | 75.09628 |
| 221 | చాగలమర్రి | 1254 | 815 | 64.99203 |
| 222 | చాగలమర్రి | 1053 | 815 | 77.39791 |
| 223 | చాగలమర్రి | 1191 | 931 | 78.16961 |
| 224 | చాగలమర్రి | 652 | 533 | 81.74847 |
| 225 | చాగలమర్రి | 642 | 514 | 80.06231 |
| 226 | చాగలమర్రి | 1042 | 775 | 74.3762 |
| 227 | చాగలమర్రి | 836 | 640 | 76.55502 |
| 228 | చాగలమర్రి | 1058 | 843 | 79.67864 |
| 229 | చాగలమర్రి | 1199 | 949 | 79.14929 |
| 230 | చిన్నవంగలి | 812 | 745 | 91.74877 |
| 231 | చిన్నవంగలి | 792 | 729 | 92.04545 |
| 232 | పెద్దవంగలి | 716 | 632 | 88.26816 |
| 233 | పెద్దవంగలి | 705 | 602 | 85.39007 |
| 234 | చింతలచెరువు | 827 | 726 | 87.78718 |
| 235 | గొడిగనూరు | 910 | 810 | 89.01099 |
| 236 | చింతలచెరువు | 939 | 810 | 86.26198 |
| 237 | గొడిగనూరు | 903 | 750 | 83.05648 |
| 272 | చక్రవర్తులపల్లె | 965 | 813 | 84.2487 |
| 273 | ముత్యాలపాడు | 1197 | 1047 | 87.46867 |
| 274 | ముత్యాలపాడు | 827 | 718 | 86.81963 |
| 275 | ముత్యాలపాడు | 989 | 818 | 82.70981 |
| 293 | డి.వనిపెంట | 582 | 517 | 88.83162 |
| 294 | డి.వనిపెంట | 433 | 378 | 87.29792 |
| 295 | డి.కొత్తపల్లె | 978 | 849 | 86.80982 |
| | మొత్తం | 40.765 | 33.873 | 83.09334 |

### కౌంటింగ్ ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూంల భద్రతపై సమీక్ష

నంద్యాల(న్యూటౌన్): కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల సురక్షితంగా నిల్వ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర సచివాలయ కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల సురక్షితంగా నిల్వ తదితర అంశాలపై చర్చించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

### దాడి కేసులో నిందితులకు రిమాండ్

ఆళ్లగడ్డ: మాజీ మంత్రి టీడీపీ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ అనుచరుడు నిఖిల్‌పై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ..గతేడాది లోకేశ్ పాదయాత్ర సందర్భంగా నంద్యాలలో అఖిలప్రియ, టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి ఘర్షణ పడ్డారు. ఈ సందర్భంగా అఖిలప్రియ వెంట ఉన్న నిఖిల్ ఏవీ సుబ్బారెడ్డిపై దాడిచేసి గాయపరిచాడు. ఇది మనస్సులో పెట్టుకున్న ఏవీ సుబ్బారెడ్డి ఎలాగైనా నిఖిల్‌ను మట్టుబెట్టాలని భావించాడు. అదును కోసం ఎదురు చూస్తూ ఉండగా ఈ నెల 14న అర్ధరాత్రి నిఖిల్, మరో వ్యక్తి అఖిలప్రియ ఇంటిముందు పహారా కాస్తున్నట్లు తెలుసుకొని నిఖిల్‌ను హత్య చేయాని నిర్ణయించుకున్నారు. నూలి అశోక్, రవి కారులో వచ్చి రోడ్డుపై నిలబడి ఉన్న నిఖిల్‌ను ఢీ కొట్టారు. అనంతరం కారులోనుంచి దిగి కత్తులతో నిఖిల్‌పై దాడిచేయగా, వారి నుంచి తప్పించుకుని అఖిలప్రియ ఇంట్లోకి పరిగెత్తాడు. దీంతో దుండగులు అక్కడి నుంచి వచ్చిన కారులోనే పారిపోయారు. ఈ సంఘటనపై గాయపడ్డ నిఖిల్‌తో పాటు ప్రత్యక్ష సాక్షి అయిన చాకలి మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుల్లో కొందరు నంద్యాల రోడ్డులో ఉన్నారనే సమాచారం మేరకు డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐ రమేష్‌బాబు సిబ్బందితో వెళ్లి పీఎస్‌ఆర్ గోడౌన్ సమీపంలోనున్న రామలక్ష్మి కొట్టాలకు చెందిన నూలి అశోక్, గజ్జలన్న వీధికి చెందిన రవిని అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా ఏవీ సుబ్బారెడ్డి ప్రోద్బలంతోనే హత్య చేసేందుకు ప్రయత్నించామని ఒప్పుకున్నారు. దీంతో ఏ–1గా నంద్యాల శివాలయం వీధికి చెందిన చంద్రకుమార్ , ఏ–2 గా టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, ఏ–3గా నంద్యాల టౌన్‌కు చెందిన మాలిక్‌బాషా, ఏ–4గా ఆళ్లగడ్డ రామలక్ష్మి కొట్టాలకు చెందిన అశోక్, ఏ–5గా గజ్జలన్న వీధికి చెందిన రవి, ఏ–6గా చిత్తిరేనిపల్లె కు చెందిన తప్పెట నరసింహ, ఏ–7గా చంటిపై కేసు నమోదు చేశామని డీఎస్పీ వివరించారు. త్వరలో మిగిలిన నిందితులందరినీ అరెస్ట్ చేస్తామని చెప్పారు.



నిందితుల అరెస్ట్ చూపి, వివరాలు వెల్లడిస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్

### బాలుడిని తీసుకెళ్లండి



శిశు గృహంలో ఉన్న చిన్నారి

నంద్యాల(అర్బన్): ఈనెల 12న డోన్ రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు వదలి పోయిన ఏడాది చిన్నారికి సంబంధించిన వారు ఆధారాలు చూపి తీసుకెళ్లవచ్చని కర్నూలు జిల్లా ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు రైల్వే గేటు సమీపంలో వదలి వెళ్లారని, డోన్‌కు చెందిన ఐసీడీఎస్ అధికారులు స్థానిక పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేసి బాలుడిని ఈనెల 15న స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కర్నూలులోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ శిశు గృహంలో ఉంచామన్నారు. ఎవరూ రాకపోతే 30రోజుల తర్వాత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్ణయం మేరకు అనాథగా తీర్మానించి సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ వారి సూచనల మేరకు దత్తత ఇస్తామని స్పష్టం చేశారు.

### వ్యక్తిగత ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

నంద్యాల టౌన్: వ్యక్తిగత ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ, పౌష్టికాహారం తీసుకుంటూ నియమబద్ధమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా రక్తపోటు బారిన పడకుండా ఉండవచ్చని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు (బీపీ) దినోత్సవం సందర్భంగా స్థానిక కార్యాలయం నుంచి సాయిబాబా నగర్ ఆర్చ్ వరకు వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం వ్యాయామం చేయటంతో పాటు, అధిక మసాలా ఉన్న పదార్థాలు తీసుకోకుండా, ఉద్వేగాలను నియంత్రించుకోవడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచవచ్చన్నారు. తలనొప్పి, జ్వరం, నీరసం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యం సంప్రదించి బీపీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ కాంతారావు నాయక్, డాక్టర్ నిర్మల శ్రీజ, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ యశోధర, డెమో ఆఫీసర్ రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.



వైద్యసిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

### నేడు చర్చి వార్షికోత్సవం

రుద్రవరం: పేరూరు గ్రామంలో శనివారం ఇమ్మానుయేలు సీఎస్‌ఐ చర్చి ప్రతిష్ఠ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం సంఘ పెద్దలు తెలిపారు. నంద్యాల అధ్యక్ష ఖండపు ఇన్‌చార్జ్ బిషప్ డాక్టర్ టీ.జార్జికార్నేలియస్ సమక్షంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



### నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

నంద్యాల(అర్బన్): ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో నాణ్యమైన జీలుగలు, పిల్లిపెసర విత్తనాలు రైతులకు అందజేయాలని ఏడీఏ రాజశేఖర్ సూచించారు. జీలుగ, పిల్లిపెసర విత్తనాలను సరఫరా చేసే బాలాజీ సీడ్స్, హరిత ఆగ్రోటెక్ ప్రాసెసింగ్ ప్లాంట్లను శుక్రవారం ఆయన ఏఓ ప్రసాదరావుతో కలిసి తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ నంద్యాల డివిజన్‌లోని మండలాలకు 1,377 క్వింటాళ్ల జీలుగలు మంజూరయ్యాయని, మరో 1,050 క్వింటాళ్లకు అనుమతులు కోరామని చెప్పారు. రైతులకు 50శాతం సబ్సిడీపై గరిష్ఠంగా ఐదు ఎకరాలకు 50 కేజీలు అందజేస్తామన్నారు. అవసరమైన రైతులు ఆర్‌బీకేలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

### కాళికాంబదేవికి విశేష పూజలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా శ్రీకాళికాంబదేవికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం తదితర పూజలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. ఒడిబియ్యం కార్యక్రమం, పుష్పాభిషేకం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చి రాహుకాల పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేయించారు.